

ఆధిక్యంలో హిమాచల్‌ప్రదేశ్
రంజీ ట్రోఫీ ఎలైట్ బి గ్రూప్‌లో ఆంధ్రతో జరిగిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్ 9 వికెట్లు కోల్పోయి 478 పరుగులు చేసింది. 10లో



ఆలోచన.. ఆవిష్కరణ
గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. చక్కటి సృజనాత్మకతకు అద్దం పట్టాయి. 10లో



సేవలు చిరస్మరణీయం
క్రీడా రంగానికి శ్రీరామనేని కోదండరామయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీ శ్రీభరత్ అన్నారు. 10లో

న్యూస్‌రీల్

నేడు ఓటరు జాబితా విడుదల



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా తొలి విడత ఓటర్ల జాబితా మంగళవారం విడుదల చేయనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన చాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రాథమిక వివరాల ప్రకారం జిల్లాలో 71 వేల మంది ఓటర్లు పెరిగారని తెలిపారు. జాబితాను అన్ని బూత్ లెవెల్ కార్యాలయాల్లో ప్రచురించడంతోపాటు అన్ని రాజకీయ పార్టీ కార్యాలయాలకు పంపిస్తామని పేర్కొన్నారు. తొలి జాబితా వెలువడిన నాటి నుంచి నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ ఉంటుందని, వచ్చే జనవరి ఒకటో తేదీ నాటికి మలి జాబితా విడుదల ఉంటుందని వెల్లడించారు. సవరణల అనంతరం 2025 జనవరి 6న తుది జాబితా ప్రచురణ జరుగుతుందన్నారు. నవంబర్ 09, 10, 23, 24వ తేదీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. డీఆర్‌వో బి.హెచ్.భవానీ శంకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

విశాఖ విద్య: స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.ఆనంద్ రెడ్డి(సూపరింటెండెంట్ ఆర్జేడీ ఆఫీస్ విశాఖ), ప్రధాన కార్యదర్శిగా కె.రామలింగేశ్వరరావు(సూపరింటెండెంట్, డీఈవో ఆఫీస్ అనకాపల్లి), కోశాధికారిగా ఇ.కృష్ణ చైతన్య(సీనియర్ అసిస్టెంట్ ఆర్జేడీ ఆఫీస్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.జగన్నాధరావు(సూపరింటెండెంట్, డీఈవో ఆఫీస్ అనకాపల్లి), అసోసియేట్ అధ్యక్షుడిగా కె.చక్రధర్‌రావు (సూపరింటెండెంట్, డీఈవో ఆఫీస్, ఏఎస్ఆర్ జిల్లా)ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కె.బంగారమ్మ, వి.పెంటారావు, జి.జ్యోత్స్న, ఎన్.మంగమ్మ, శైలజా కుమారిలను ఎన్నుకున్నారు. వీరితో పాటు విద్యాశాఖలోని వివిధ కార్యాలయాల్లో పని చేస్తున్న పలువురిని అసోసియేషన్‌కు సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పదవులకు ఎంపిక చేశారు. డీఈవో ప్రేమ్‌కుమార్ సమావేశానికి హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

నేడు జాబ్‌మేళా
మురళీనగర్: పెందుర్తి టీటీడీసీలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. ట్రినిటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో 20 మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీర్, సేఫ్టీ సూపర్‌వైజర్ ఉద్యోగాలకు రూ.1.80 లక్షలు ప్యాకేజీ చెల్లిస్తారు. డిప్లమా, బీటెక్, బీఈ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ చేసి 23–45 ఏళ్ల వయసు గల అభ్యర్థులు అర్హులు. ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్ కంపెనీలో 100 టెక్నిషియన్ అండ్ హెల్పర్స్ ఉద్యోగాలకు ఐటీఐ, డిప్లమా చేసి 18–45 ఏళ్ల వయసు గల అభ్యర్థులు అర్హులు. రూ.1.96 లక్షల నుంచి రూ.2.16 లక్షల ప్యాకేజీ ఉంటుంది. భారత పే ప్రైవేట్ లిమిటెడ్‌లో 45 టీమ్ మేనేజర్, ఫీల్డ్‌సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు పదో తరగతి ఆపై అర్హత కలిగిన 18–40 ఏళ్ల వయసు గల వారు అర్హులు. రూ. 2.50 లక్షల ప్యాకేజీ ఉంటుంది. వివరాలకు 9014766143 నంబరులో సంప్రదించవచ్చు.

ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి మధ్య స్పెషల్ రైలు
తాటిచెట్లపాలెం: ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–సంత్రగచ్చి మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఎంజీఆర్ చెన్నైసెంట్రల్–సంత్రగచ్చి(06133) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్‌లో సోమవారం రాత్రి 7.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.45 గంటలకు దువ్వాడకు అదేరోజు రాత్రి 11.30 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (06134) బుధవారం ఉదయం 10.10 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరి బుధవారం మధ్య రాత్రి 1.50 గంటలకు దువ్వాడకు అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.


డీఎస్సీ శిక్షణకు ముగిసిన దరఖాస్తు గడువు
ఎంవీపీకాలనీ: డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు ఈనెల 27వ తేదీతో ముగిసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు తెలిపారు. అభ్యర్థులకు వచ్చే నెల మొదటి వారంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అనంతరం అర్హులతో కూడిన ఎంపిక జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

డెంగ్యూ డేంజర్ బెల్స్

ఎక్కడ చూసినా జ్వర పీడితులే

నగరంలో డెంగ్యూ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. డెంగ్యూతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. డెంగ్యూ బారిన పడ్డ వారిలో ప్లేట్‌లెట్స్ పడిపోతుండటంతో అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రిలో చేరుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇప్పటికే ఈ ఏడాది నగరంలో 572కి పైగా డెంగ్యూ కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ ఇంట్లో చూసినా జ్వరంతో బాధపడుతున్న వారు ఒకరిద్దరైనా ఉంటున్నారు.

- రోజురోజుకు పెరుగుతున్న డెంగ్యూ, మలేరియా కేసులు
- అపరిశుభ్ర వాతావరణంతో విజృంభిస్తున్న దోమలు
- ఇప్పటికే 572 డెంగ్యూ, 133 మలేరియా కేసులు నమోదు



ఈ ఏడాది జనవరి 1 నుంచి అక్టోబర్ 25 వరకు 6,473 మందికి డెంగ్యూ పరీక్షలు చేయగా 572 మందికి డెంగ్యూగా నిర్ధారణ అయింది. 2,22,976 మందికి మలేరియా పరీక్షలు చేయగా 133 కేసులు నమోదయ్యాయి. కేజీహెచ్‌లో రోజు ఓపీకి 10 నుంచి 20 మంది జ్వర బాధితులు వస్తుండగా ఇందులో 5 నుంచి 10 వరకు డెంగ్యూ కేసులు ఉంటున్నాయి. ఇక ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరినవారి సంఖ్య వందకు పైగానే ఉంటుంది.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ఆస్పత్రుల కిటకిట
గత కొద్ది రోజులుగా కేజీహెచ్‌తో పాటు నగరంలో పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా డెంగ్యూ జ్వర పీడితులు చేరుతున్నారు. కొంత మంది ఇంటి వద్ద కూడా వైద్యం చేయించుకుంటున్నారు. కేజీహెచ్ భావనగర్ వార్డు ఏఎంసీ యూనిట్‌లో 15 పడకలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మలేరియా, డెంగ్యూ కోసం ఈ ప్రత్యేక పడకల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

మహారాణిపేట: జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు జ్వరపీడితులు క్యూ కడుతున్నారు. సాధారణం కంటే 20 శాతం ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. ముందస్తు చర్యలు లేకే డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డెంగ్యూ బారిన వారు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంది. డెంగ్యూ వస్తే తెల్ల రక్తకణాల కౌంట్ తగ్గిపోయి ప్రాణాల మీదకు వస్తుంది. ప్రస్తుతం నగరంలో జ్వరాలతో పది మంది ఆస్పత్రుల్లో చేరితే.. వారిలో నలుగురు డెంగ్యూ బాధితులే ఉంటున్నారని అధికారులు చెబుతున్నారు. పైగా వీరిలో చాలా మందిలో కాలేయ, కిడ్నీలపై ప్రభావం పడినట్లు డాక్టర్లు చెబుతున్నారు. అంతేకాక ప్రస్తుతం నగరంలో డెంగ్యూతో పాటు మలేరియా కేసులు పెరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.



కేజీహెచ్‌లో ఓపీ కోసం క్యూలైన్లలో రోగులు, వారి బంధువులు

ఈ జాగ్రత్తలు తీసుకోండి..
- టైగర్ దోమ కుట్టిన 4–5 రోజులకు డెంగ్యూ ఫీవర్ లక్షణాలు కనిపిస్తాయి.
- 102 డిగ్రీల జ్వరం, కళ్ల వెనుక భాగంలో విపరీతమైన నొప్పి, ఒంటి నొప్పులు, ఒంటిపై ఎర్రటి దద్దుర్లు ఉంటే డెంగ్యూ జ్వరంగా అనుమానించాలి.
- వైరల్ ఫీవర్ వల్ల కూడా తీవ్ర జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి డెంగ్యూ తరహా లక్షణాలు కొందరిలో కనిపిస్తాయి.
- మూడు రోజుల తర్వాత కూడా ఈ లక్షణాలు తగ్గకపోతే ఆస్పత్రికి వెళ్లాలి.
- డెంగ్యూ లక్షణాలు కనిపించిన వెంటనే ఎన్ఎస్1 యాంటిజెన్ ఎలిశా టెస్ట్ చేయించాలి.
- వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స ప్రారంభించాలి.
- జ్వరం వచ్చి 5 రోజులు దాటితే డెంగ్యూ నిర్ధారణకు ఐజీఎం యాంటీబాడీస్ టెస్ట్ చేయించాల్సి ఉంటుంది.
- డెంగ్యూని సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే నయమవుతుంది.
- అప్రమత్తంగా ఉంటూ ప్లేట్‌లెట్లు, బీపీ తగ్గకుండా చూసుకోవాలి.
- జ్వరం తగ్గినా జాగ్రత్తగా ఉండి ప్లేట్‌లెట్ల సంఖ్య పెరిగేలా చూసుకోవాలి.
- కొబ్బరి నీళ్లు, మజ్జిగ లాంటి ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి.
- దోమలు కుట్టకుండా జాగ్రత్తపడాలి.

పరీక్షలు తప్పనిసరి



వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులు దగ్గరలో ఉన్న యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు లేదా ఏదైనా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలి. డెంగ్యూను ప్రాథమికంగా గుర్తించే కిట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక పరీక్షలో డెంగ్యూ పాజిటివ్ అయితే రక్త నమూనాను ఏఎంసీకి అనుబంధంగా ఉన్న మైక్రోబయాలజీ సెంటర్‌కు పంపుతారు. అక్కడ మాక్ ఎలిశా టెస్టు నిర్వహించి వ్యాధి నిర్ధారిస్తారు.
–డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో

కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డు



కేజీహెచ్‌లో డెంగ్యూ జ్వర బాధితులకు చికిత్స అందుతోంది. భావనగర్ వార్డులో వీరి కోసం ప్రత్యేకంగా 15 పడకలు సిద్ధం చేశాం. ప్రతి రోజు ఓపీకి 10 నుంచి 20 మంది జ్వర బాధితులు వస్తున్నారు. ఇందులో 5 నుంచి 10 వరకు డెంగ్యూ కేసులు ఉంటున్నాయి. డెంగ్యూకు కేజీహెచ్‌లో నాణ్యమైన చికిత్స అందిస్తున్నాం.
– డాక్టర్ శివానంద, కేజీహెచ్ సూపరింటెండెంట్

చికిత్స తీసుకున్నా...
నా వయసు 30 సంవత్సరాలు. వారం రోజుల క్రితం జ్వరం వచ్చింది. ఒళ్లునొప్పులు, తలనొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నాను. పరీక్షలు చేస్తే డెంగ్యూగా నిర్ధారించారు. మందులు వాడాను. జ్వరం తగ్గింది. అయితే నీరసం ఎక్కువగా ఉంది. తలనొప్పి వస్తోంది. బయట తిరగలేని పరిస్థితి నెలకొంది.
–నాగేశ్వరరావు, అఫీషియల్ కాలనీ

చెత్తా చెదారం వల్ల దోమల వృద్ధి



పేరుకుపోయిన చెత్తా చెదారం

అల్పపీడనాలు కారణంగా వర్షాలు కురుస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో నీళ్ల నిల్వ ఉండిపోతున్నాయి. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. ఎక్కడబడితే అక్కడ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పూర్ణా మార్కెట్ వెనుకభాగం, దొండపర్తి, లలితానగర్ (బ్రిడ్జి వద్ద), వెలంపేట, రేసపువానిపాలెం, ఐటీ సంస్థ, ప్రసాద్ గార్డెన్స్, రెల్లివీధి, పంజా జంక్షన్, అల్లిపురం, రామకృష్ణా జంక్షన్, రైతుబజార్ తదితర ప్రాంతాలు చెత్తా చెదారానికి నిలయంగా మారాయి. రెండు మూడు రోజులు వరుసగా సెలువులు వస్తే అన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. కాలువల్లో సకాలంలో పూడికలు తీయకపోవడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి.



డెంగ్యూ కేసు వచ్చిన ఏరియాలో సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

బాధితులతో నేనే మాట్లాడతా..!

- ఒకసారి నమోదైన ఫిర్యాదు మళ్లీ ఓపెన్ కాకూడదు
- ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధ వహించాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు మరింత శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఒకసారి నమోదైన ఫిర్యాదు మళ్లీ ఓపెన్ కావడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అలా జరిగితే ఫిర్యాదు దారులతో స్వయంగా తానే మాట్లాడతానని అధికారులను ఆయన హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులను అధికారుల బృందం స్వీకరించింది. ఈ సందర్భంగా గత వారం వచ్చిన వినతులు..పరిష్కారానికి తీసుకున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. సోమవారం వచ్చిన వినతుల్లో 26 ఫిర్యాదులు అత్యవసరంగా పరిష్కరించాల్సినవి ఉన్నాయని, ఆయా శాఖల అధికారులు మంగళవారం సాయంత్రంలోగా వాటిని పరిష్కరించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గత వారం వచ్చిన ఫిర్యాదుల్లో 27 పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ–ఆఫీస్ విధానానికి ప్రాధాన్యత ఇచ్చి ఫైళ్లను సర్క్యులేట్ చేయాలని సూచించారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు 237 వినతులు అందాయన్నారు. వాటిలో రెవెన్యూ విభాగానికి 54, జీవీఎంసీకి 61, పోలీసు శాఖకు 19, ఇతర శాఖలకు 103 ఉన్నాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి. శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ పాల్గొన్నారు.

అర్జీలకు తక్షణ పరిష్కారం

జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 89 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 89 వినతులు అందాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ హరి వెంకటకుమారి.. కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో జోన్–1కి 2, జోన్–2కి 17, జోన్–3కు 12, జోన్–4కు 5, జోన్–5 కు 22 , జోన్–6 కు 10, జోన్–8 కి 11 ఫిర్యాదులు అందగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 10 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఆర్ సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీర్ శివప్రసాదరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, సీసీపీ ప్రభాకరరావు, డీసీ(రెవెన్యూ) శ్రీనివాసరావు పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ సంపత్ కుమార్ అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలనుంచి తరుచూ ఒకే సమస్యపై ఫిర్యాదులు వస్తున్నాయని, అవి రాకుండా చూడాలని సూచించారు. వచ్చిన అర్జీలపై సంబంధిత సీనియర్ అధికారులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 84 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

మొక్కుబడి సమావేశాలెందుకు?

- సాగుదారుల హక్కు చట్టం ప్రాంతీయ సదస్సుపై రైతుల పెదవివిరుపు
- రైతులకు సమాచారం లేకుండా సదస్సా?
- ప్రభుత్వం, అధికారుల తీరును ఎండగట్టిన రైతులు

మహారాణిపేట: కొత్త సాగుదారుల హక్కు చట్టం -2024 ప్రాంతీయ రైతు సదస్సులో రైతులు ఆవేశం వెళ్లగక్కారు. ఇప్పటివరకు ఒక్క పథకం అమలుచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కొత్తసాగుదారుల హక్కు చట్టం-2024 రూపకల్పనకు భూ యజమానులు, కౌలు రైతులు, అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఆరు జిల్లాల నుంచి రైతులు, అధికారులు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వ తీరును రైతులు ఎండగట్టారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన ఏ ఒక్క పథకం ఇంకా అమలు చేయకపోవడంపై మండిపడ్డారు. పంటల పెట్టుబడి కోసం రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారని, ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల భారీ వర్షాలకు పంటలకు భారీ నష్టం వచ్చిందని, అధికారులు వివరాలు కూడా సేకరించారని, ఇప్పటి వరకు ఎలాంటి సహాయం అందలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్

గ్రామ సభలకు రైతులు రావడం లేదు

గ్రామ సభలకు రైతులు రావడం లేదని వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సభలకు కనీసం పది మంది కూడా హాజరుకావడం లేదన్నారు. ఉపాధి హామీ గ్రామ సభలు కూడా జరగడం లేదని చెప్పారు. 2011, 2019 చట్టాలను రద్దు చేయడంతోపాటు నూతన కౌలురైతు చట్టంపై చాలా మంది రైతుల్లో భయాందోళనలు నెలకొన్నాయని, నివృత్తి చేసేందుకు ఈ సదస్సు నిర్వహించామన్నారు.

నూతన చట్టంతో కౌలు రైతులకు మేలు చేకూరుతుందన్నారు. తొలుత వ్యవసాయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు సీసీఆర్‌సి యాక్టు-2019లో లోపాలను, రానున్న న్యూ టినెంట్ యాక్టు-2024పై చర్చించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ వి.శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఏడీఏ ఎం.గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండా సదస్సు



ప్రాంతీయ సదస్సు కోసం అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదు. రైతుల ద్వారా తెలుసుకొని వచ్చాం. సదస్సు వివరాలను రైతులకు తెలియజేయాల్సిన బాధ్యత విశాఖ వ్యవసాయ శాఖ అధికారులకు లేదా? ఇలాంటి సభల వల్ల రైతులకు న్యాయం జరగదు. గ్రామ సభలు పెట్టి అభిప్రాయాలు తీసుకుంటే ఎవరైనా చెప్పగలరు.
–నాయుడు బాబు, రైతు సంక్షేమ సంఘం నాయకుడు అనకాపల్లి

పంట పెట్టుబడి ఏది?



ఎన్నికల ముందు రైతుల సంక్షేమ కోసం ఊదరగొట్టారు. ఇప్పుడు ఐదు నెలలైనా ఎలాంటి పథకం అమలు చేయలేదు. పంట పెట్టుబడి కోసం ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాలేదు.
–శ్రీనివాస్, రైతు, అనకాపల్లి

పనాజీలో జీవీఎంసీ కార్పొరేటర్ల బృందం



పనాజీ మున్సిపల్ కమిషనర్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

దాబాగార్డెన్స్: పనాజీ మున్సిపల్ కార్పొరేషన్‌ను జీవీఎంసీ కార్పొరేటర్ల బృందం సందర్శించింది. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణను పరిశీలించింది. ఈ మేరకు జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ గోవా నుంచి పర్యటన వివరాలను సోమవారం తెలిపారు. పనాజీ నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుతున్న అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనాజీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వివరించారు. అనంతరం పనాజీ మున్సిపల్ కమిషనర్ క్లీన్ మధిరను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు సత్కరించారు. అనంతరం జీవీఎంసీ కార్పొరేటర్ల బృందం మీరా మార్ బీచ్‌ను సందర్శించింది. పర్యాటకులు ప్రమాదవశాత్తు మునిగిపోతున్నప్పుడు ఏ విధంగా రక్షించాలి అనే అంశంపై నిర్వహించిన డెమో తిలకించారు. అక్కడ వాడుతున్న సమాచార యంత్రాలు, రోబో మిషన్, అనౌన్స్‌మెంట్, సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు సురేష్ పాల్గొన్నారు.

క్రీడా రంగానికి కోదండరామయ్య సేవలు చిరస్మరణీయం

- కోదండరామయ్య స్మారక క్రీడా భవనం ప్రారంభం



కోదండరామయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్

విశాఖ సిటీ : క్రీడా రంగానికి శ్రీరామనేని కోదండ రామయ్య చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ.. ఆయన స్ఫూర్తిని కొనసాగించే దిశగా అందరూ ముందుకు సాగాలని ఎంపీ శ్రీభరత్ పిలుపునిచ్చారు. సోమవారం ఏయూలో బాస్కెట్‌బాల్ మైదానం ఎదురుగా భారతీయ బాస్కెట్‌బాల్ కోచ్ శ్రీరామనేని కోదండరామయ్య స్మారక క్రీడా భవనాన్ని ఎంపీ ప్రారంభించారు. ముందుగా కోదండరామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ క్రీడలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించే దిశగా కృషి చేస్తామన్నారు. నేటి తరం పిల్లలను స్మార్ట్ ఫోన్లకు దూరంగా క్రీడలకు దగ్గరగా చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కోదండరామయ్య కుమారుడు శ్రీధర్ మాట్లాడుతూ తన తండ్రికి క్రీడలు తప్ప వేరే ధ్యాస ఉండేది కాదన్నారు. ఆయన పేరు మీదుగా చిరస్థాయిగా నిలిచే పని చేయాలని ఏయూలో ఈ భవనాన్ని నిర్మించామని చెప్పారు. ఈ ప్రక్రియలో ఏయూ అందించిన సహకారం మరువలేమన్నారు. రూ.2 కోట్లకు పైగా నిధులతో 250 మంది కూర్చునే విధంగా అధునాతన ఏసీ ఆడిటోరియాన్ని నిర్మించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా ఒలింపిక్ క్రీడాకారిణి ఎర్రాజీ జ్యోతిని ఘనంగా సత్కరించారు. ఆమెకు రూ.5 లక్షల చెక్కును దాతలు అందజేశారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, క్రీడా విభాగాధిపతి ఆచార్య పల్లవి, డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ పాల్గొన్నారు.

హోటల్‌పై నుంచి పడి చిన్నారి మృతి



రుషిక మృతదేహం

గుణదల(విజయవాడతూర్పు): ఆటలాడుతున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు హోటల్ బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందిన సంఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. మాచవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నగరానికి చెందిన వంకాయల బదరీ నాగరాజు(37) ఫార్మాసిస్టుగా పనిచేస్తుంటాడు. ఆయన భార్య సాయి గీత గృహిణి. బాబు జై అద్విక్(6), పాప రుషిక(4) ఉన్నారు. ఈ నెల 26న కుటుంబ సమేతంగా తీర్థయాత్రల కోసం నాగరాజు తన కుటుంబంతో కలిసి సొంత కారులో బయలుదేరాడు. శ్రీశైలం, మహానంది వంటి పుణ్యక్షేత్రాలు దర్శించుకుని 27వ తేదీ రాత్రి విజయవాడ వెటర్నరీ కాలనీలో గల ఓ ప్రైవేటు హోటల్‌లో దిగారు. సోమవారం ఉదయం భార్య బిడ్డలతో అదే హోటల్లో అల్పాహారం తీసుకుని నాగరాజు దంపతులు విశ్రాంతి తీసుకునేందుకు తమ గదికి వెళ్లారు.

కిటికీ నుంచి జారి పడి: హోటల్ గదిలో ఆడుకుంటున్న చిన్నారి రుషిక తన అన్నను పట్టుకునేందుకు ప్రయత్నిస్తూ కిటికీ వైపు పరుగులు తీసింది. కిటికీకి ఐరన్ గ్రిల్ లేకపోవడంతో చిన్నారి నాలుగో అంతస్తు నుంచి కింద పడిపోయింది. దీంతో తలకు బలమైన గాయమైంది. ఇది గమనించిన అక్కడి హోటల్ సిబ్బంది నాగరాజుకు సమాచారం అందించారు. అంతా కలసి ఆ చిన్నారిని దగ్గరలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రథమ చికిత్స చేసిన వైద్యులు చిన్నారి ప్రమాదకర పరిస్థితిలో ఉందని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే ఆ చిన్నారిని గుణదలలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ పాప మృతి చెందినట్లు ప్రభుత్వాస్పత్రి వైద్యులు స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హోటల్ గదిని పరిశీలించి ప్రమాదం తాలుకు వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లడిల్లిన తలిదండ్రులు

అప్పటివరకు ఆటపాటలతో సరదాగా గడిపిన తమ గారాల పట్టి ఆకస్మాత్తుగా మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. తనతో పాటు ఆడుకునే చిన్నారి చెల్లెలు ఇకపై తనతో ఉండదని ఆ అన్న కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు.

ఆలోచన..ఆవిష్కరణ

- సృజనకు పదునుపెట్టిన విద్యార్థులు
- గురుకుల సీవోఈలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం
- 33 గురుకులాల నుంచి 88 నమూనాల ప్రదర్శన
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విద్యార్థుల హాజరు



నమూనాలు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీ భరత్

మధురవాడ: గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వీరి నమూనాలు చక్కటి సృజనాత్మకతకు అద్దం పట్టాయి. ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను విద్యార్థులు చక్కటి పరిష్కారాన్ని చూపించే వర్కింగ్ నమూనాలు తయారు చేశారు. ఇవి సందర్శకులతో పాటు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సైతం ఔరా అనిపించాయి. అద్భుతమైన నమూనాలకు మధురవాడ సమీపంలోని కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదిక అయింది. ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 'ఫ్యూచర్ ఆన్' పేరుతో జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర పరిధిలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు పరిధిలో లెక్కలు, సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హ్యూమానిటీస్‌తో పాటు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో సీనియర్, జూనియర్ విభాగాల్లో 33 గురుకులాలు నుంచి వచ్చిన 150 మంది విద్యార్థులు 88 వర్కింగ్ నమూనాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, అంతర్గత శక్తులను వెలికి తియ్యడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు ప్రశ్నించే స్వేచ్ఛను ఉపాధ్యాయులు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధికి ఉపయోగపడే విద్య అవసరమన్నారు. విశాఖ జిల్లా గురుకుల డీసీవో రూపావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతికుమారి, డీసీవోలు పాల్గొన్నారు.

ఫ్రీ ఎనర్జీ జనరేటర్



రూపకర్తలు : యు. హర్షిత, బైపీసీ, ఐ. చాందిని, ఎంపీసీ, ఎచ్చెర్ల
గైడ్ టీచర్: ఎం. శ్రీమొల్లా

తక్కువ ఖర్చుతోనే ఫ్రీ ఎనర్జీ జనరేటర్ తయారు చేయవచ్చునని బాల మేధావులు నిరూపించారు. అన్ని రకాల ఇంధనాలు ఖర్చు విపరీతంగా పెరిగిపోవడం, కొరత వలన ప్రత్యామ్నాయ ఇంధనం ఆవశ్యకత అవరం ఉందని వారు వివరించారు. తక్కువ ఖర్చుతో మానవ ఆరోగ్యానికి ఎటువంటి హాని లేని ఎకో ఫ్రెండ్లీ ఇంధనం తయారు చేయవచ్చునని నిరూపించారు.

ఆకట్టుకున్న పెయింటింగ్



కళాకారులు : ఎల్. కార్తిక్, ఎం. బాలు, సీహెచ్. గౌతం, జి.భార్గవ్, 9వ తరగతి
గైడ్ టీచర్: సుధాకర్, ప్రిన్సిపాల్ వి. రత్నవల్లి, ఈవోఈ, శ్రీకృష్ణాపురం

విద్యార్థులు తమ నైపుణ్యం, సృజనాత్మక శక్తిని ఉపయోగించి అందమైన బొమ్మలు, ఆకర్షణీయమైన కళాఖండాలు తయారు చేశారు. వరదలు వచ్చినప్పుడు బాధితులను రక్షించే విధానం, దేశ నాయకులు పెయింటింగ్స్ చక్కగా వేశారు. పైగా సాధారణంగా దొరికే వస్తువులతో పలు ఆకృతులు తయారు చేశారు.

లెక్కల చిక్కుముడులకు పరిష్కారం



లెక్కలకు సంబంధించిన వివిధ ఆకృతులతో వైశాల్యాలు సులువుగా కనుక్కోవచ్చునని విద్యార్థులు చక్కగా వివరించారు. లెక్కల చిక్కుముడులు సులువుగా అధిగమించవచ్చని రూపొందించిన ప్రాపర్టీస్ ఆఫ్ సర్కిల్ ద్వారా వివరించి మన్ననలు పొందారు.
విద్యార్థులు: పి. తనూజ, 8వ తరగతి, ఎ.నిస్సి, 7వ తరగతి, గురుకుల సీవోఈ, మధురవాడ

ట్రాఫిక్ అలెర్ట్- పర్యావరణ రక్షణ సిస్టం



రూపకర్తలు : డి. విశ్వనాథ్, ఎం.అశోక్, 8వ తరగతి, సబ్బవరం
గైడ్ టీచర్: డాక్టర్ టి.రాంబాబు, ప్రిన్సిపాల్ యస్.రామకృష్ణ

మానవ ఆరోగ్యకర జీవనంలో ట్రాఫిక్ హెచ్చరికలు, పర్యావరణ పరిరక్షణ వ్యవస్థ విశేషమైన పాత్ర పోషిస్తోంది. కాలుష్య దేశాల్లో భారత దేశం 3వ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యం. ట్రాఫిక్ అలెర్ట్- పర్యావరణ రక్షణ సిస్టం ప్రాజెక్టు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. దీనిలో ఉండే సెన్సార్ ద్వారా గ్రహించే కాలుష్య శాతం ఎల్ఈడీలో చూపిస్తుంది. కాలుష్య శాతం ఎక్కువ ఉంటే హెచ్చరికలు జారీ చేస్తుంది.

ఆటో మెటిక్ పార్కింగ్ సిస్టం



రూపకర్తలు : ఎం.రుడా ఇవాంజలిన్, ఇంటర్ సెకెండ్ ఇయర్. వై. ప్రవళిక సాయిప్రియ, 10వ తరగతి, సీవోఈ, మధురవాడ
గైడ్ టీచర్ : ఉష పట్టణ జనాభా విపరీతంగా పెరుగుతున్న తరుణంలో పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. అందుకే ఆటోమెటిక్ కార్ పార్కింగ్ ద్వారా ఈ సమస్యకు చక్కని పరిష్కారం లభిస్తుంది. ఈ ప్రక్రియ అంతా సాంకేతికత సహాయంతో ఆటోమేటిక్‌గా జరుగుతుంది. పైగా పార్కింగ్ ఆక్యుపెన్సీ కూడా ఎల్ఈడీ ద్వారా ప్రదర్శిస్తుంది.

ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసిన వారిని ఆదుకోవాలి



మాట్లాడుతున్న బేవరేజ్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులు

అల్లిపురం: మద్యం షాపుల్లో ఐదేళ్లుగా సూపర్‌వైజర్లుగా, మేనేజర్లుగా పనిచేసిన వారిని కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసిందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, కసిరెడ్డి సత్యనారాయణ ఆరోపించారు. వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 15వేల మంది సూపర్‌వైజర్లు, మేనేజర్లు, వాచ్‌మెన్లు రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపుల్లో పనిచేశారన్నారు. వీరందర్నీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతన మద్యం పాలసీ ద్వారా తొలగించడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. అయితే 2.50లక్షల మందిని, 15వేల మంది బేవరేజస్ ఉద్యోగులను ఇప్పటికే రోడ్డునపడేసి మోసం చేసిందన్నారు. వీరికి గత ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. తక్షణమే వారికి ఉపాధి కల్పించాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు, హరినాథరావు, గణేష్, మహదేవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యకర ప్రవర్తన..!

- రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగిని నిలదీసిన స్థానికులు
- పీఎంపాలెం పోలీసు స్టేషన్‌కి చేరిన వ్యవహారం



పీఎంపాలెం పోలీసు స్టేషన్‌వద్ద మహిళలు

మధురవాడ : మధురవాడ స్వతంత్రనగర్‌లో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడని స్థానికులు ఆందోళన చేశారు. అతడు సోమవారం ఓ బాలికను ఇంటికి పిలిచి అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఏడ్చుకుంటూ వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. తల్లిదండ్రులతో పాటు స్థానికులు సోమవారం రాత్రి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఇంటికి వెళ్లి నిలదీశారు. స్థానిక బాలికలను ఇంటికి తీసుకెళ్లి వారితో చనువుగా ఉంటూ అసభ్యకరంగా ప్రవరిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడని ఆరోపించారు. స్థానికులు పోలీసు టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయడంతో పీఎంపాలెం ఎస్ఐ భాస్కరరావు సంఘటన స్థలానికి చేరుకుని సదరు వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

విమ్స్‌లో సెక్యూరిటీ గార్డుపై దాడి

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో సెక్యూరిటీగార్డుపై ఓ వ్యక్తి మద్యం మత్తులో దాడి చేశాడు. దీంతో సెక్యూరిటీ గార్డు చేతి వేలు విరిగిపోయింది. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపిన వివరాలు.. ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఓ రోగి ఈ నెల 20న ఆస్పత్రిలో చేరడానికి వచ్చారు. కేస్‌షీట్ నింపిన తర్వాత ఇంటికి వెళ్లిపోయాడు. అదే కేస్‌షీట్‌తో ఈ నెల 27న రాత్రి వచ్చి ఇన్‌పేషెంట్‌గా చేరుతానన్నాడు. కొత్త కేస్‌షీట్ తీసుకురావాలని సిబ్బంది చెప్పడంతో ఇంటికి వెళ్లిపోయాడు. కాగా ఆ రోగి బంధువు మంగళవారం రాత్రి మద్యం మత్తులో విమ్స్‌కు వచ్చి మా వాడిని ఎందుకు చేర్చుకోలేదని గొడవ చేశాడు. అంతటితో ఆగకుండా గేటులో చేయిపెట్టి సెక్యూరిటీ చేతిని లాగాడు. ఈ ఘటనలో సెక్యూరిటీ గార్డు చేతి వేలు విరిగిపోయింది. సిబ్బంది ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విమ్స్‌కు చేరుకొన్నారు. ఇంతలో మందుబాబు పారిపోయాడు.

ఆధిక్యంలో హిమాచల్‌ప్రదేశ్

- వశిష్ట్ సెంచరీ, ధావన్ డబుల్ సెంచరీ మిస్
- 134 పరుగుల వెనుకబడిన ఆంధ్ర జట్టు



195 పరుగులు చేసిన ధావన్

విశాఖ స్పోర్ట్స్: రంజీ ట్రోఫీ ఎలైట్ బి గ్రూప్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్రపై హిమాచల్‌ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సాధించింది. వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సోమవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి హిమాచల్‌ప్రదేశ్ 9 వికెట్లు కోల్పోయి 478 పరుగులు చేసింది. నాలుగు వికెట్లకు 198 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆటను కొనసాగించగా... అకాష్ వశిష్ట్ 85 పరుగుల వద్ద రాజుకు క్లీన్‌బౌల్డ్ అయి సెంచరీని మిస్ చేసుకున్నాడు. కెప్టెన్ రిషి ధావన్ సైతం 195 పరుగుల వద్ద మనీష్ బౌలింగ్‌లో వెనక్కి మళ్లి డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. ఐదో వికెట్‌కు వీరిజోడి 141 పరుగులు జోడించింది. ధావన్‌తో కలిసి ముకుల్(42) ఆరో వికెట్‌కు 121 పరుగులు జోడించడంతో ఆంధ్రపై తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యానికి చేరింది. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌ను 344 పరుగులుకు ముగించిన విషయం విదితమే. అర్పిత్(15), దివేష్(12) క్రీజ్‌లో నిలిచారు. శశికాంత్ నాలుగు వికెట్లు తీయగా రాజు మూడు వికెట్లు తీశాడు. విజయ్, మనీష్ చెరో వికెట్ తీయగలిగారు. నాలుగు రోజుల ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో హిమాచల్‌ప్రదేశ్ 134 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతుంది.

3న రెడ్డి ఉచిత వివాహ పరిచయ వేదిక

సీతమ్మధార : శ్రీ వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నవంబర్ మూడో తేదీన రెడ్డి ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు వివేకానంద రెడ్డి తెలిపారు. ఆశీలమెట్టలోని వేమన మందిరంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశీలమెట్ట వేమనమందిరంలో ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామన్నారు. వివరాలకు 93932 61661, 99881 31234, 98856 63937, 98495 30390 నంబర్లకు సంప్రదించాలనిఆయన కోరారు.

విచారణకు అనకాపల్లి డీపీవో డుమ్మా

మహారాణిపేట: పంచాయతీరాజ్‌లో అడ్డగోలు బదిలీలపై విచారణకు అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి డుమ్మా కొట్టారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తి విచారణ నిర్వహించారు. గత నెల 28,29న తేదీల్లో అడ్డగోలు బదిలీలపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లా పరిషత్ సీఈవోను ఆదేశించిన సంగతి తెలిసిందే. కొద్ది రోజులుగా జెడ్పీ సీఈవో విచారణ చేస్తున్నారు. సోమవారం విచారణకు రావాలని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ అధికారులకు నోటీసులు ఇచ్చారు. అయితే విచారణకు కీలకమైన అనకాపల్లి డీపీవో హాజరు కాలేదు. విశాఖ డీపీవో, ఏఎస్సార్ నూతన డీపీవో విచారణకు హాజరయ్యారు. బుధవారం ముగ్గురు డీపీవోలు విచారణకు రావాలని విచారణ అధికారి ఆదేశించారు. ఈవోపీఆర్అండ్ ఆర్డీల జాబితా తయారు చేయాలని, ఇప్పటి వరకు ఏజెన్సీలో ఎవరు పనిచేయలేదో వివరాలు తెలియజేయాలని విచారణ అధికారి కోరినట్టు సమాచారం.

బీఎస్ రెడ్డికి 'డాక్టర్ ఆఫ్ మ్యాజిక్' పట్టా అందజేత



బీఎస్ రెడ్డికి బంగారు పతకం అందజేస్తున్న టోనీ హాసిని

సీతమ్మధార : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భారతీయ మహేంద్రజాలికుడు బీఎస్ రెడ్డి ప్రశంసల ఖాతాలోకి మరో అరుదైన గౌరవం వచ్చి చేరింది. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ ఐదురోజులపాటు 'థాయి లాండ్ ఇంటర్నేషనల్ మ్యాజిక్ ఎక్స్‌ట్రావగంజా-2024' పేరిట బ్యాంగ్‌కాక్‌లో నిర్వహించిన ప్రపంచ స్థాయి మ్యాజిక్ కన్వెన్షన్‌లో భారత దేశం తరపున జ్యూరీ జడ్జిగా వ్యవహరించారు. ఈ వేడుకకు జపాన్, అమెరికా,చైనా, ఆస్ట్రేలియా, ఇండియా, ఇరాన్, కువైట్, కొరియా, థాయిలాండ్, హాంకాంగ్, వియాత్నం తదితర దేశాలకు చెందిన 150 మంది మెజీషియన్స్ హాజరయ్యారు. జ్యూరీ జడ్జిగా వ్యవహరించిన బీఎస్ రెడ్డికి ఇంటర్నేషనల్ మెజీషియన్స్ సొసైటీ చైర్మన్ టోనీ హాసిని బంగారు పతకాన్ని అందజేసి గౌరవించారు. అలాగే అమెరికాలోని మ్యాజిక్‌లో మూడేళ్ల కోర్సు పూర్తి చేసిన బీఎస్ రెడ్డికి ఇదే వేదికపై యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ ఆఫ్ మ్యాజిక్ పట్టాను అందజేశారు. ప్రపంచ వేదికపై బంగారు పతకం, డాక్టరేట్ అందుకోవడం చాలా ఆనందంగా ఉందని రెడ్డి తెలిపారు. ఈ విజయం భారతీయ ఇంద్రజాల కళాకారుల్లో నూతన ఉత్తేజం నింపుతుందన్నారు. ఈ సందర్భంగా బీఎస్ రెడ్డికి విశాఖకు చెందిన పలువురు ఇంద్రజాలికులు అభినందనలు తెలిపారు.

నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



శ్రీనివాసరావు

మల్కాపురం: కెనడాలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురు నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన వ్యక్తిని మల్కాపురం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా.. నర్సీపట్నం నియోజకవర్గం.. గొలుగొండ మండలం గుండుపాలెం గ్రామంలో వడిల్లిబోయిన శ్రీనివాసరావు నివాసముంటున్నాడు. మల్కాపురం ప్రాంతంలో అతని బంధువులుంటున్నారు. తరుచూ ఇక్కడకు వస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఇంటి పక్కన నివాసముంటున్న అంగ శ్రీనుతో పరిచయం అయింది. యోగ క్షేమాలు తెలుసుకున్నాడు. ప్రస్తుతం ఖాళీగా ఉన్నానని, ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నానని శ్రీను చెప్పాడు. దీంతో కెనడాలో ఓ సూపర్ మార్కెట్‌లో సేల్స్ బోయ్‌గా ఉద్యోగాలు ఉన్నాయని, తనకు తెలిసిన మార్గం ద్వారా అక్కడకు పంపిస్తానని శ్రీనివాసరావు నమ్మబలికాడు. అయితే రూ.లక్ష ఖర్చు అవుతుందన్నాడు. దీంతో అప్పు చేసిన రెండు నెలల కిందట లక్షరూపాయలు అంగశ్రీను ఇచ్చాడు. అలాగే శ్రీను స్నేహితులు తొమ్మిది మంది దాదాపు రూ.11 లక్షల వరకూ శ్రీనివాసరావుకు ఇచ్చారు. నెలలు గడుస్తున్నా శ్రీనివాసరావు నుంచి ఎటువంటి సమాచారం రాకపోవడం..ఫోన్ చేస్తే పొంతన లేని సమాధానం చెప్పడం ప్రారంభించాడు. గట్టిగా అడిగేసరికి ఫోన్ నంబర్లను బ్లాక్ చేశాడు. దీంతో తామంతా మోసపోయామని భావించి బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు. అంగ శ్రీను ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన సీఐ విద్యాసాగర్ నిరుద్యోగులను మోసగించిన శ్రీనివాసరావును సోమవారం నర్సీపట్నం వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు.